


# అందమైన భార్య

ప్రకాశరావు

కొన్ని సంఘటనలు మరపురాకుండా వుండిపోతే మరి కొన్నింటిని తేలిగ్గా మరచిపోతాం. అవసరంలేని విషయాలనూ, బాధాకరమైన సంగతులనూ బయటకు తోసి కావలసినవి మాత్రం జ్ఞాపకం పెట్టుకోగలగడం మానవుడి మేధస్సుకు గొప్ప వరం. కాని మనం మరిచిపోయా మనుకున్న విషయాలు కొన్ని మెదడులో మరుగున పడివుంటాయి. వాటి అవసరం వచ్చినప్పుడో, మరో సందర్భం వల్లనో నిద్రాణమై వున్న జ్ఞాపకాలు ఒక్కసారిగా మళ్లీ జరిగినట్లే కదుల్తాయి కళ్ల ముందు. నా విషయంలో అంతే జరిగింది ఒకసారి.

బెనర్జీ నేనూ ఒకేచోట లెక్చరర్లుగా చేరడం కేవలం యాదృచ్ఛికం. ఖరగ్‌పూర్‌లో చదువుకుంటున్నప్పుడు వంటబట్టిన బెంగాలీ మమ్మలనిద్దరినీ మరీ సన్నిహితులుగా చేసింది. బెనర్జీ చాలా సరదా మనిషి. ఇంటర్వ్యూకు వచ్చినప్పుడు మొదటిసారి కలుసుకున్నాం మేము.

మనసులో ఎంత విషాదముంటే ముఖం మీద చిరునవ్వు అంతతీయగా వుంటుం దనడానికి చక్కని ఉదాహరణ బెనర్జీ. తండ్రిపోయిన తరవాత కష్టపడి ఎమ్. ఈ. పూర్తి చేసుకున్నాడు. ఆ తరవాత కలకత్తాలోనే కొన్నాళ్లు వుద్యోగం చేసి ప్రస్తుతం నాతోబాటు ఢిల్లీలో చేరాడు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిచేయడం భారత దేశంలో సాధారణ విషయం కాదు. ఇద్దరు చెల్లెళ్ల పెళ్లి చేయడానికి బెనర్జీ ఎంత శ్రమించినదీ తేలిగ్గానే వూహించుకోవచ్చు. నా పెళ్లై మూడేళ్లైనా నాకంటే వయసులో కొద్దిగా పెద్దవాడైన బెనర్జీకి ఇంకా పెళ్లి కాకపోవడానిక్కారణం అదే నేమో. రెండవ చెల్లి పెళ్లి కూడా అయి నిలదొక్కుకోగలిగిన తరవాత తల్లి పోరు పడలేక తన పెళ్లివిషయం ఆలోచించడం మొదలెట్టాడు. బెనర్జీ ఇంటికి అప్పు డప్పుడు పోతూ వుండడంవల్ల నాకు తెలిసిన విషయాలివి.

ఓ రోజు హడావుడిగా దూసుకువచ్చాడు బెనర్జీ నాగదికి. చేతిలోవున్న కాగితాలను బల్లమీద పడవేసి కుర్చీలాగి కూర్చున్నాడు. గోవిందా అనుకుని కలం జేబులో వేసుకుని పుస్తకాలు మూసి పక్కకు నెట్టాను. నేనడగబోయే లోపునే ఒక్కముక్కలో తేల్చాడు తను వచ్చిన పని.

'మనం చండీఘర్ వెళ్లాలి.'

'మనం అన్నావు గనక ఎందుకు?, ఎప్పుడు? నేకూడా నీతో ఏడవడం ఎందుకు? నేనుకూడా వస్తానని ఎందు కనుకుంటున్నావు?...లాంటి ప్రశ్నలకు జవాబులు అదే క్రమంలో ఇవ్వాల్సిన అవ సరం ఎంతేనా వుంది.' కుర్చీలో వెనక్కివాలి అన్నాను.

'అదే వరసలో జవాబివ్వడం కష్టం: టూకీగా చెప్పాలంటే నీవుకూడా రావడం ఎంతేనా అవసరం. పైగా భాభీజీ లేరు గనక ఈ మూడురోజుల సెలవుల్లో నీవు రాగలవని నా అభిప్రాయం — వస్తావనే నా నమ్మకం.'

నాకు నవ్వొచ్చింది; అసలు విషయా న్నతడు వదిలేసి పదేపదే నీవూ రావాలి అంటూంటే. 'అసలు విషయం చెప్పలేదు. నీవు చండీఘర్‌కు వెళ్ళడం ఎందుకు? నీతోబాటు నేనూ అఘోరించడం ఎందుకు?'

'చెప్పాలంటే చాలా పెద్దకథ. అందు కని నీకు విసుగు రాకుండా ముఖ్య విషయాలు మాత్రం చెప్తాను. ఇప్పుడే క్లుప్తంగా చెప్పాలంటే...ఇదో...'

ఆ తరవాత ఏం మాట్లాడకుండా కోటుజేబులోంచి ఓ కవరు తీసి నాముందు గిరాటేశాడు.

అతన్నే చూస్తూ ఆ కవరు విప్పి కాగితాలు బయటకు లాగాను. బెనర్జీ నిర్లక్ష్యంగా బయటకు చూస్తున్నాడు. ఆ కాగితం మడతల్లో ఒక అమ్మాయి ఫోటో కనిపించేసరికి దాదాపు అంతా అర్థమైంది. ఆ వుత్తరం అమ్మాయి తండ్రి వ్రాసింది—బెంగాలీలోవుంది.

'పెళ్ళి చూపులా ?'

బెనర్జీ నన్నే చూస్తున్నాడు. అవు నన్నట్టు తల పంకించాడు.

మళ్ళీ ఆ ఫోటోవేపు చూశాను. ఆ అమ్మాయి సౌందర్యం ప్రస్ఫుటమయ్యే చక్కని కోణంలో తీసిన ఫోటో అది. కుడిచేయి సున్నితంగా బల్లమీద మోపి, రెండోచేయి క్రిందికి జార్చి చీర కుచ్చెళ్ళను నాజూగ్గా పట్టుకుని, తల కొద్దిగా ఎడంవేపు తిప్పివుంది. నిండుగా చీరలో వున్నా ఆమె అవయవ సౌందర్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తూంది. చక్కని నిష్పత్తిలోవున్న శరీరాకృతి, రీటా ఫరియా ఆకారాన్ని జ్ఞప్తికితెచ్చే లావణ్యం ఆమెది. ఆకర్షణీయమైన గుండ్రని మొహం. సంపూర్ణ యవ్వనంలోవున్న మనోహర రూపవతి ఆమె. ఇంత చక్కని అమ్మాయిని వెతుక్కోగలగడం బెనర్జీ అదృష్టం అను కున్నాను.

కవర్లోకి ఫోటో తోస్తూ చిన్నగా నవ్వి అన్నాను, 'కంగ్రాట్స్! ఎవరీమె ?'

'చెప్పాగా చాలా పెద్ద కథ అని. అయినా చెప్పమంటే నాకేం అభ్యంతరంలేదు ... దాదాపు నాలుగునెల్ల క్రింద ఓ బెంగాలీ దినపత్రికలో ప్రకటన వేయించాను. ఒక అందమైన, ఎమ్.ఏ. ఈ పాసై నెలకు ఎనిమిదివందల జీతంతో ఢిల్లీలో వుద్యోగం చేస్తున్న ఇరవైతొమ్మిది సంవత్సరముల బెనర్జీ యువకునికి అందమైన, చదువు కున్న భార్య కావలెను— అంటూ. దానికి జవాబుగా యాభై వుత్తరాలు వచ్చాయి. వాటిలో పన్నెండుమందిని ఎన్నుకుని ఫోటో జాతకం పంపమని వ్రాశాను. పది ఫోటోలు వచ్చాయి. ఈ అమ్మాయి నా ప్రథమ ఎన్నిక—బహుశ ఈమెనే...' అంటూ ఆగిపోయాడు.

కవరు తిప్పిచూశాను. బెనర్జీ తల్లిపేర వ్రాసివుంది. నాకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది. అదే ఆంధ్రలో అయితే ఇలాంటి ప్రకటనలనెవ్వరూ గంభీరంగా తీసుకోరు. 'ఆఁ! ఎక్కడా చెల్లని సరకు' అని చప్ప రించేస్తారు. అలా పత్రికల్లో ప్రకటించడం ఇంకా ఏదో అగౌరవమైన విషయం గానే భావిస్తారు మనవాళ్ళు.

'ఇంటరెస్టింగ్! బెంగాలీల్లో ప్రకటనలద్వారా పెళ్ళిళ్ళు కుదరడం అంత సామాన్యమైన విషయమా?' మామూలుగానే అడిగాను నేను.

'అవును ఏం? ఒకవిధంగా చూస్తే చాలా అవసరంకూడా. వుద్యోగరీత్యా దూర ప్రాంతాల్లో వుండిపోయిన వాళ్ళతో సంప్రదించడం మరోలా సాధ్యంకాదు. మా చెల్లెళ్ళిద్దరికీ ఇలాగే కుదిరాయి.'

ఈ విషయంలో బెంగలీలు ఎంతో ముందున్నారనిపించింది నాకు. కట్నం విషయంలో మధ్యవర్తిద్వారా ఒప్పందం కుదిరింతరవాత కానీ అసలు విషయానికి దిగరు. కట్నం లేకుండా వివాహాలు జరగడం ఇంకా అరుదే మనలో.

'బెంగాలీల్లో వరకట్నం పూర్తిగా నశించిపోయిందనలేం. కాని కట్నం తీసుకోక పోవడమనేది అరుదుకాదు. నిజానికి నేను కట్నమే కాదు, మరే విలువైన బహుమతి కూడా స్వీకరించుకోదలుచుకోలేదు' బెనర్జీ సాలోచనగా దృఢంగా అన్నాడు.

మళ్ళీ కాస్సేపాగి చిలిపిగా అన్నాడు, 'నాక్కావలిసింది అందమైన భార్య, చక్కని స్నేహితురాలు, లాలించే ప్రియురాలు ... అంతే. డబ్బు నేనూ సంపాదించగలను.'

బెనర్జీకి ఆ అమ్మాయి ఎంత నచ్చిందో అతని తల్లితో మాట్లాడిన తర్వాత బాగా అర్థమైంది నాకు. నేనేమీ ఆశ్చర్యపోలేదు. తన కొడుకు ఫలానాతేదీ వచ్చి అమ్మాయిని చూస్తాడనీ, నచ్చిన విషయం తెలియజేసి సంప్రతింపులకు ఎప్పుడు రావలసిన సంగతీ అతడే చెబుతాడనీ వ్రాశానని చెప్పారు ఆమె నాకు. దీన్నిబట్టి బెనర్జీ ఆ అమ్మాయిని తప్పక పెళ్ళిచేసుకోదలుచుకున్నాడని అనిపించింది నాకు. ఈ పెళ్ళిచూపులు కేవలం ఒక వంకగా తీసుకుని తన నిశ్చయాన్ని వాళ్ళకు చెప్పడానికి మాత్రం వెళ్తున్నాడని వూహించుకున్నాను. ఆ అమ్మాయి తండ్రీ, చక్రవర్తిదికూడా ఏమంత స్థితిగతులున్న కుటుంబం కాదు. ఆయన పెన్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ అమ్మాయికి ఇద్దరు చెల్లెళ్ళూ, బి. ఈ పాసైన అన్నా వున్నారు. బెనర్జీకంటే మంచి సంబంధం వాళ్ళకు దొరకడంకూడా బహుశ కష్టమే అనిపించింది నాకు.

బెంగాలీల్లో కూడా ఇలా పెళ్ళిచూపులకు అబ్బాయి వంటరిగా వెళ్ళడు. బెనర్జీ తల్లి పెద్ద వయసువల్ల దూర ప్రయాణాలు చేయలేరు. అందుకే ఆవిడ నన్ను కూడా వెళ్ళమని అడిగారు. నిజానికి పెళ్ళి చూపులు ఎలా జరుగుతాయో నాకూ తెలియదు. మా ఆవిడతో పెళ్ళికి ముందునుండీ బాగా పరిచయం గనక పెళ్ళి చూపుల్లాంటివి ఏవీ లేకుండానే మా పెళ్ళి అయిపోయింది. పైగా వుత్తర దేశస్థుల ఆచార వ్యవహారాలు అట్టే తెలియవు నాకు; అయినా బెనర్జీ వెంట బయల్దేరక తప్పలేదు.

సాదరంగా ఆహ్వానించాడు చక్రవర్తి మా ఇద్దరినీ చండీఘర్‌లో పంచాయత్ భవన్‌లో మకాంవేసి మర్నాడు వుదయమే వెళ్ళాం వాళ్ళింటికి. ఆ రోజే సాయంత్రంలోగా తిరుగు ప్రయాణమవ్వాలని మా ప్లాను

చక్రవర్తి మామూలు లావులో కొద్దిగా పొడుగ్గా వున్నాడు. మేం కూర్చుంటుండగా చక్రవర్తి భార్య కూడా వచ్చి పలకరించింది. చక్రవర్తి కొడుకు కూడా కాస్సేపటి తరవాత వచ్చి కూర్చున్నాడు. మాతో

పాటు. బెనర్జీ అతన్ని నిశితంగా చూస్తూండటం గమనించాను నేను. కాస్సేపు మామూలు సంభాషణల్లోనే గడిచింది.

హఠాత్తుగా అన్నాడు చక్రవర్తి. 'అమ్మాయిని ఇప్పుడే చూస్తారా? లేక భోజనాల తరవాత చూస్తారా ... మీ యిష్టం...'

బెనర్జీ ఇబ్బందిగా నావేపు చూశాడు. అతని కళ్ళల్లో ఆత్రుత గమనించి నాకు నవ్వొచ్చింది. ఆ అమ్మాయిని కళ్ళారా చూడాలని తహ తహ లాడిపోతున్నాడు అతను.

'...ఇప్పుడు చూడ్డానికి మాకు అభ్యంతరం లేదు.' మీ ఇష్టం అన్నట్లుగా అన్నాను.

ఇంతలో ఓ పదిహేడేళ్ల అమ్మాయి ట్రేలో ప్లేట్లు, టీ పట్టుకుని వచ్చింది. ట్రే టేబుల్‌మీద వదిలి నమ్రతగా నమస్కరించింది. 'పూర్ణిమ' అని పరిచయం చేశాడు చక్రవర్తి.

చక్రవర్తి కొడుకు బెనర్జీకి ప్లేటు అందిస్తూంటే చక్రవర్తి మరో ప్లేటు నాకు జాగ్రత్తగా పట్టుకుని అందించాడు. నెమ్మదిగా ఫలహారంచేస్తూ మాట్లాడుకుంటున్నాం. బెనర్జీ కదలికల్లో తొందర, ఆదుర్దా స్పష్టంగా కనిపించింది నాకు. రసగుల్లా తింటుంటే రెండుసార్లు పొలమారింది అతనికి. వీలైనంత గంభీరంగా వుండడానికి ప్రయత్నిస్తున్నాడతను. మంచి నీళ్ళ గ్లాసు బల్లమీద పెడుతూ అడిగాడు బెనర్జీ,

'మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు?'

చక్రవర్తి మొహం కొద్దిగా ముడత పడింది. సాధ్యమైనంత మామూలుగా అన్నాడు, 'పోయిన ఏడే బి.ఈ. పాసయ్యాడు .. ఇప్పుడు వుద్యోగ ప్రయత్నంలో వున్నాడు.. ఈ నెల్లోనే దొరకవచ్చు.'

మళ్ళీ అన్నాడు చక్రవర్తి 'అమ్మాయి బి. ఏ. ప్యాసై రెండేళ్ళయ్యింది. ఈ మధ్యే సంగీతం బాగా నేర్చుకుంది. కుట్లూ అల్లికలూ చాలా బాగా వచ్చు; ఫాబ్రిక్ పెయింటింగ్, చిత్రలేఖనం కూడా వచ్చు. ఈ డిజైన్ మా అమ్మాయి వేసిందే' టేబుల్ మీది బట్టను చూపించాడు.

చక్రవర్తి భార్య తెర తొలిగించి ఓసారి చక్రవర్తి వేపు చూసి లోపలికి వెళ్ళింది,

# అందమైన భార్య

ఇప్పుడే వస్తానని చక్రవర్తి ఆమె వెనకె వెళ్ళాడు. పూర్ణిమ వచ్చి ప్లేట్లు జాగ్రత్తగా పట్టుకుపోయింది.

గదిలో నేనూ బెనర్జీ మాత్రం వున్నాం. అతడేదో ఆలోచిస్తూ గదిని నలువేపులా పరీక్షగా చూస్తున్నాడు. గది ఆడంబరంగా కాకున్నా అందంగా అలంకరింపబడి వుంది. సోఫా సెట్ రంగులోనే పెయింట్‌చేసి వున్నాయి గోడలు. చిన్న గాజు అలమారులో బొమ్మలు పేర్చి వున్నాయి. గోడకు రెండు వర్ణచిత్రాలు తగిలించి వున్నాయి. కిటికీలకు పసుపు పచ్చని తెరలు ఎండ లోపలికి రాకుండా అడ్డు పడుతున్నాయి. బెనర్జీ ఒక్కసారిగా లేచి కిటికీ తెరలు పక్కకు జరిపాడు; నా పక్కన కూర్చుంటూ రహస్యంగా అన్నాడు,

'ఈ పచ్చని తెరలు కళ్ళను మోసం చేస్తాయి తెలుసా! ఆమె శరీర వర్ణం సరిగ్గా తెలియదు.'

నాకు ఇది ఘోరమనిపించింది. అతన్ని మోసం చేయడానికి చక్రవర్తి తెలివిగా పచ్చతెరలు కట్టాడనుకోవడం. నేనేదో అనబోయేలోగా చక్రవర్తి వచ్చాడు. ఆవెనకే మందగమనంతో ఆయన కూతురూ, ఆ వెనక తల్లీ వచ్చారు.

నేననుకున్నట్టే అసాధారణ సౌందర్యఖని కాకపోయినా అత్యంతాకర్షణీయమైన విగ్రహం ఆమెది. ఆమె ప్రతి అవయవమూ పొందుగా శిల్పి తీర్చి దిద్దినట్లున్నాయి. నల్లని పొడవాటిజడ ఆమె పచ్చని దేహచ్ఛాయవల్ల ఇంకా నల్లగా కనిపిస్తూంది. ముఖాన ఎర్రటి బొట్టు తళతళ లాడుతూంది. నమస్కరించి, మేం కూర్చున్న తరవాత తలవంచుకు కూర్చుంది ఆమె.

ఇక బెనర్జీ ప్రశ్నలడగడం మొదలెట్టాడు.

'మీ పేరు?'

'బందన చక్రబొర్తి' (వందన చక్రవర్తిని బెంగాలీలు అలాగే ఉచ్ఛరిస్తారు.)

'మీ హాబీలు ఏమిటి?'

'సంగీతం కొద్దిగా వచ్చు. పెంటింగ్, కుట్లూ నేర్చుకున్నాను.'

'వంట బాగా వచ్చా?'

ఆడపిల్లకు ఎన్ని వచ్చినా రాకపోయినా వంటమాత్రం వచ్చితీరాలి. అసలు ఆడపిల్లలు వంటకు తప్ప మరి దేనికీ పనికి రారని మనవాళ్ళ అభిప్రాయం.

'మృష్టాన్నం వండేప్పుడు చక్కెర మొదటే వేస్తారా? లేక అంతా వుడికిం తరవాత వేస్తారా?'

బెంగాలీలో పరమాన్నాన్ని మృష్టాన్నమంటారు.

'బి. ఏ. తరవాత చదువెందుకు ఆపారు?'

'బి. ఏ. లో సబ్జక్ట్సు ఏమిటి?'

ఇలా కాస్సేపు బోరుకొట్టి ఆతరవాత అడిగాడు—ఏదేనా పాడి వినిపించమని. ఆమె కంఠం శ్రావ్యంగా వుంది; బాగా సాధన చేసివుంటుంది.

'స్వరాలు ఎన్నిరకాలు?'

'శుద్ధస్వరమనీ, వికృతస్వరమనీ రెండు రకాలు—చలస్వరమనీ, అచలస్వరమనీకూడా విభజిస్తారు.'

'వికృతస్వరాలు ఎన్నివిధాలు?'

'కోమల వికృతమనీ, తీవ్ర వికృతమనీ రెండు విధాలు'

'రాగాలు ఏవేవి నేర్చుకున్నారు?'

'...కళ్యాణ్, బిహాగ్ ... భూపాలీ, భైరవీ...'

'భైరవీరాగానికీ భైరవ్‌రాగానికీ తేడా చెప్పగలరా?'

యూ. పీ. ఎస్. సీ ఇంటర్వ్యూలో అడిగినట్లడుగుతున్నాడు. సంగీతం వచ్చునన్న పాపానికి ఇంత తరిచి అనుమానంగా ప్రశ్నలు వేయడం ఎందుకు? ఆ మాటకువస్తే పెళ్ళి తరవాత సాధన చేసుకోవడానిక్కూడా తీరుబడి వుండదు చాలామందికి. మా వాడికి నిజానికి సంగీతం ఏమ్మాత్రం రాదు—ఏదో కొద్ది పరిచయం తప్ప.

ఆ అమ్మాయి వీడువేసిన ప్రశ్నకు ఒక్కసారిగా బిత్తరపోయింది. ఏదో జవాబివ్వబోయి ఆగిపోయి తల వంచుకు కూర్చుంది, జడను చేత్తో తడుముకుంటూ. హిందూస్తానీ సంగీతంలో భైరవ్, భైరవి రెండు వేరే రాగాలనీ; భైరవ్‌లో రి, ధ మాత్రం కోమలస్వరాలు, భైరవిలో అన్నీ కోమల స్వరాలనీ ఎవరో చెప్పగా విన్నట్టు జ్ఞాపకం అని బెనర్జీ చెప్పాడు తర్వాత నాకు.

మావాడు ఆ అమ్మాయి పూర్తిగా నచ్చినట్టే మాట్లాడి ఇక్కడికి వచ్చి శల్య

పరీక్షచేయడం నాకు పొత్తిగా నచ్చలేదు. విశానికి ముళ్ళమీద కూర్చున్నట్టుగా ఫీలయ్యాను అంతసేపు. ప్రేక్షకుడుగా వున్న నాకే అంత బాధాకరంగా అనిపిస్తే ముద్దాయిలా పరీక్షింపబడుతున్న ఆ అమ్మాయి స్థితి, ఓర్పుగా కూర్చున్న ఆ అమ్మాయి తలితండ్రుల అవస్థా వర్ణించడమేకాదు. వూహించుకోగలగడంకూడా నాకు సాధ్యం కాని పని. 'అమ్మాయి అంటే అంత లోకువా!' అనిమాత్రం అనుకోగలిగాను. తన చెల్లెళ్ళు పెళ్ళికి అంత గొడవపడ్డ తరవాత కూడా బెనర్జీ ఇలా ప్రవర్తింపడం క్షంతవ్యం కాదనిపించింది నాకు. బాధలవల్ల మనిషి మానవుడిగా మారతాడంటారు, కొందరు—అంటే లోతుగా ఆలోచించలేని వాళ్ళు మానవత్వాన్ని ఏ పరిస్థితుల్లో కూడా సంతరించుకోలేరు.

ఈ ధీరుడు వేసే ప్రశ్నలకు తడబడుతూ, కొంత భయంవల్లా, కొంత స్త్రీ సహజమైన లజ్జవల్లా కుంచించుకుపోయి కూర్చుంది ఆ అమ్మాయి.

ఒక్కసారిగా నావేపు తిరిగి అన్నాడు బెనర్జీ,

'నీవేం అడగవేం? నీవూ అడుగు ఏదేనా.'

ఆ అమ్మాయి తలెత్తి నా వేపు చూసింది. బెదురుగా రెప రెపలాడాయి కళ్ళు. నేనేం అడుగుతానో అనేమో!

విరాగ్గా అన్నాన్నేను, 'నీవడిగిన ప్రశ్నలు

# అందమైనభార్య

చాలు. ఇప్పుడా అమ్మాయి అడుగుతూంది నిన్ను.'

అంతా ఒక్కసారి నవ్వారు. వందన చక్రవర్తి కూడా ఫక్కున నవ్వింది.

'అవును!' ఉదారంగా అన్నాడు బెనర్జీ, 'ఏదేనా అడగాలంటే అడగండి.'

ఆ అమ్మాయి తలవంచుక్కూర్చుంది, పమిట సర్దుకుంటూ. తల్లి ఒకసారి హెచ్చరించినా ఏం మాట్లాడలేదు.

ఇక చాలు అన్నట్లుగా చూశాన్నేను చక్రవర్తి వేపు. విడుదల పొందిన రామ చిలకలా ఫీలైంది ఆ అమ్మాయి.

ఆ తరవాత కాస్సేపటికి అలా చూసి వస్తామన్న మిషమీద బయటపడ్డాం మేమిద్దరమూ. తోవలో అన్నాడు బెనర్జీ.

'నే చాలా నిరాశ పొందాను రఘూ. ఈమె నేననుకున్నంత అందంగా లేదు. ఆ ఫోటో చూసి చాలా మోసపోయానని పిస్తూంది నాకు.'

'కాదు. వందన చక్రవర్తిని వున్న దానికంటే ఎన్నోరెట్లు ఎక్కువ సౌందర్యవతిగా వూహించుకున్నావు నీవు.'

తీవ్రంగా చూశాడు బెనర్జీ. కాస్సేపాగి చిన్నగా అనుమానంగా అన్నాడు.

'ఈ అమ్మాయికి ఇద్దరు చెల్లెళ్లు అన్నట్టు రాశాడు ఈయన. కాని మనకు ఒక చెల్లెలే కనిపించింది. నా వుద్దేశ్యంలో మనం చూసిన ఇద్దరమ్మాయిలకూ మధ్య కూతురు ఆమె అని. ఆమె ఈ ఇద్దరికంటే అందంగా వుండేవుంటాలి, అందుకే అమెను మనకు చూపించలేదు...'

నేనేం మాట్లాడలేదు.

'కాని... ఈయన కొడుకు చదువులో మొద్దబ్బాయిలా వున్నాడే. ఈ అమ్మాయికి ఇరవై రెండేళ్ళన్నారు — అంటే ఆమె అన్నయ్యకు ఇరవైనాలుగు ఇరవైఐదేనా వుంటాయి. ఇరవైనాలుగేళ్లకు బి. ఏ. దాటా దంటే బండిఎక్కడో...'


'నీవు పెళ్ళి చేసుకునేది అమ్మాయిని కదూ', చిరాకును సాధ్యమైనంతగా కప్పిం పుచ్చి సౌమ్యంగా అన్నాను. 'ఆమె రెండేళ్ళ క్రిందే బి. ఏ. పాసైందన్నారు; సంగీతం, వేరే పనికి వచ్చే విషయాలూ కూడా నేర్చుకుందావిడ...'

'కావచ్చు! కాని ఆ అమ్మాయి రక్త సంబంధీకుల ప్రభావం పుట్టబోయే (మా) పిల్లలమీద చాలా వుంటుంది.''

'జెనటిక్స్ చాలా కాంప్లెక్స్ సబ్జక్ట్ బెనర్జీ. ఆ విషయంలో ఏమీ తెలియని వాళ్లం మనిద్దరం చర్చకు దిగితే చాలా హాస్యాస్పదంగా వుంటుంది. ఏదో నాకమ్మ కబుర్లు చెప్పుకుని లాభంలేదు.. నీక్కావలిసింది చక్కని స్నేహితురాలూ, లాలించే ప్రియురాలు మాత్రం — అని అన్నావు గుర్తుందా?'

'అవును కాని ఈ అమ్మాయి నేననుకున్నంత అందంగా లేదు,' బెనర్జీ మళ్ళీ మొదటికొచ్చాడు. 'ఈమె నిజంగా అందగత్తె అయివుంటే నేనీ విషయాలేవీ ఆలోచించక పోయేవాడిని. ఆ ఫోటోలో ఈమె అంత అందంగా లేకపోతే అసలు ఇక్కడికి క్కూడా వచ్చేవాడిని కాదు. వీళ్లదేమంత గొప్పకుటుంబమని!... నేనెంతో ఆశతో వచ్చాను రఘూ. అందమైన భార్య కావాలని నా కోరిక. అది బలహీనతే అను—మరేదేనా అను.'

'కుటుంబ వ్యక్తుల ప్రభావం పిల్లల మీద వుంటుంది అని ఓ వేపు అంటూనే మరోవేపు ఈమె అందంగా వుండివుంటే అవేం ఫరవాలేదు అంటున్నావు. ఈ అమ్మాయి అతిలోక సౌందర్యవతి కాక పోవచ్చు కాని అందంగా లేదు అని నేనను



శెప్పు.'

'ఆ అమ్మాయి నవ్వినప్పుడు నీవు గమనించలేదా? ముందు పళ్ళు మరీ పెద్దగా వికారంగా వున్నాయి...'

'గుర్రాలను కొనేముందు ఇలాగే పరీక్షిస్తారు.'—వళ్ళు మండింది నాకు.

తిరిగి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఓ ఏడేళ్ళ పాపను తన చిన్నకూతురని చక్రవర్తి చెప్పినప్పుడు బెనర్జీ మొహంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. ఏదో తప్పు చేసినవాడిలా చూపులు తిప్పుకున్నాడు నానుండి. భోజనాలప్పుడు మాటల్లో అన్నాడు చక్రవర్తి.

'...నెల్లాళ్ళ క్రితమే ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి జర్మనీలో సెటిల్ అయ్యాడు. కొద్దినెల్ల కోసం వచ్చాడట ఇక్కడికి. అన్నీ దాదాపు కుదిరినట్లే అనిపించింది. కాని ఆ అబ్బాయి పెళ్ళి చేసుకుని వెళ్తాడట—ఆతర్వాత ఏడాదికి వచ్చి తీసుకు పోతాడట అమ్మాయిని. ఈ ఏర్పాటు నాకు తృప్తికరంగా అనిపించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మా అమ్మాయిని ఇవ్వలేనని ఖచ్చితంగా చెప్పాను...'

తిరిగి వెళ్తూంటే తోవలో ఇది జ్ఞాపకం వచ్చి అన్నాడు బెనర్జీ '—ఆయన కబుర్లు విన్నావా! ఎవరో జర్మనీలో సెటిల్ అయ్యాడట, ఈయన కూతురును చేసుకుంటానంటే వీలేదు పొమ్మన్నాడట. సరుకు వెల్లబడి కావడానికిలాంటి కబుర్లు చాలా ముఖ్యం. ఇంతోటి అందగత్తెలు ఎవరూ లేరేమో!' వెటకారం ధ్వనించింది బెనర్జీ మాటల్లో. చాలా సేపు వాదించుకున్నాం మేము.

'ఆ అప్రస్తుత విషయాలు వదిలేయి. అసలు అందమంటే ఏమిటో చెప్పు నాకు.'

'అందమంటే ఏమిటి, ఏమిటి? అందమంటే అందమే' చిరాగ్గా అన్నాడు బెనర్జీ.

మొదటే అన్ని విషయాలూ జాగ్రత్తగా పరిశీలించి, ఏదేదో వూహించుకుని వెళ్ళి ఆ అమ్మాయి చేత డ్రిల్ చేయించి నిరాశ కారిపోయి వచ్చాడు. అందమైన భార్య లభించడం అంత తేలిక విషయం కాదు. ఇలా చాలా ట్రిప్పుల తరవాతగాని బెనర్జీ పెళ్ళి కాలేదు. ఈ వందన చక్రవర్తిని బొత్తిగా మరిచి పోయాన్నేను— నిజం చెప్పాలంటే ఆమె గురించి మళ్ళీ ఎప్పుడూ ఆలోచించలేదు నేను.

ఈ మధ్యే స్టుట్‌గార్ట్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్ పుణ్యమా అని జర్మనీ వెళ్ళాన్నేను. సెలవురోజు షాపింగ్‌కని బయల్దేరి బస్సు దిగినప్పుడు నా వెనకే ఎవరో జంట బెంగాలీలో మాట్లాడుకుంటూ దిగితే అప్రయత్నంగా వెనక్కి తిరిగాను. వూహించని వింతేదో హఠాత్తుగా ఎదురొచ్చినట్లనిపించింది. మనస్సు ఒక్కారిగా వెనక్కి పరుగెత్తింది — మరుగున పడిపోయిన జ్ఞాపకాల కోసం. ఆమెకూడా నన్ను గుర్తించినట్లుగా నవ్వి పలకరించింది.

లిప్తపాటులో జ్ఞాపకం వచ్చింది నాకు. ఆమె ఒకప్పుడు వందన చక్రవర్తి. ●

# పళ్ళు - గుణాలు

## జామిపండు

జామి పళ్ళలో తెలుపు, ఎరుపు అని రకాలున్నాయి. అనకాపల్లి జాంపళ్ళు మన ఆంధ్రప్రదేశ్‌లో ప్రశస్తమైనవిగా ప్రసిద్ధి చెందేయి.

బాగా పండిన జామిపండు వేడిచేసి నీరు పెంచుతుంది. ఉష్ణతత్వం గలవారి గుండెకు పొట్టకు బలాన్ని యిస్తుంది. ఎక్కిళ్ళు వస్తున్నప్పుడు జాంపండు తింటే ఆ ఎక్కిళ్ళు తగ్గుతాయి.

నీళ్ళ విరేచనాలవుతున్నట్లయితే ఒకటి రెండు పచ్చికాయలు నమలి మింగండి. లేదా వాని కషాయాన్ని త్రాగండి. తగ్గుతాయి.

గంజాయి తీసుకోవడం వల్ల మత్తుగా వికారంగా ఉన్నట్లయితే— జామి ఆకుల కషాయాన్ని తగు మోతాదులో యివ్వండి. మత్తు వదులుతుంది.

లేత జామి ఆకుల కషాయాన్ని తగు మోతాదులో యిస్తే పురాణ నీళ్ళ విరేచనాలు, కడతాయి. కలరా సోకినప్పుడయే విరేచనాలు, వాంతి కూడా కడతాయి.

వాతతత్వం గలవారు జాంపళ్ళు అధికంగా తింటే కడుపు నొప్పి, తలనొప్పి వస్తుంది. కడుపులో పిటపట లాడుతుంది. కడుపు బిగపడుతుంది. జ్వరం రావచ్చు. జాం పండులోని గింజలు, పైతొక్క సులభంగా జీర్ణంకావు. మూలవ్యాధి గలవారికీ పండు మిక్కిలి అపథ్యమయినది. పండు ఏమాత్రం కుళ్ళినా అది మరి తినకూడదు.

ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :— 1. అనుములు 2. సోపు.

## కర్బూజాపండు

ఈ పండు శరీరానికి సమశీతోష్ణాన్ని కలుగజేస్తుంది. మహాశాంతి నిస్తుంది. మంచి బలాన్ని యిస్తుంది. శీఘ్రంగా జీర్ణమయి వేగంగా రక్తంలో కలుస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. శరీరానికి ఉత్సాహాన్ని యిస్తుంది. బుద్ధిని వికసింపజేస్తుంది. శరీరంలో గల దుష్ట పదార్థ కూటమిని విడగొడుతుంది. కిడ్నీస్‌నకు సత్తువనిస్తుంది. మూత్రపు సంచిలోని రాళ్ళను కరిగించి మూత్రం బాగా జారీ అయేటట్లు చేస్తుంది. బాలింతలగు స్త్రీలకు బాగా పాలు పడేటట్లు చేస్తుంది. ఉబ్బుజబ్బు, పాండు రోగం గలవారికిది ఎంతో మేలు చేస్తుంది.

ఎగ్జిమా గలవారు ప్రతిరోజూ ఒకపండు చొప్పున కొన్ని దినాలపాటు తిన్నట్లయితే ఎగ్జిమా నయమవుతుంది. అన్నికాలాలలోనూ ఈ పండు దొరకదు. కావున ఈ పండు విత్తులను జాగ్రత్త చేసి వాని చూర్ణాన్ని తగు మోతాదులో పుచ్చుకోవచ్చును. ఈ పండుకు గల గుణాలే యించుమించుగా విత్తుల చూర్ణానికి కూడా ఉంటాయి. విత్తుల చూర్ణాన్ని లేదా కషాయాన్ని తగు మోతాదులో యిస్తే టైఫస్ ఫీవరు తగ్గుతుంది.

ఈ పండును పరగడుపున తిన్నట్లయితే ఆకలి మందగిస్తుంది. తలనొప్పి వస్తుంది. పైత్య జ్వరం కూడా రావచ్చు. అందుచేత పరగడుపున ఈ పండు తినకూడదు. భోజనానంతరం సుమారు రెండు గంటల తరువాత తినడం మంచిది. పైత్యతత్వం గలవారికి, శరీరంలో రక్తం అధికంగా ఉన్నవారికి ఇది హాని చేస్తుంది. అమితంగా తింటే విరేచనాలవుతాయి. గుండెకు హాని కల్గుతుంది.

ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :— 1. తేనె 2. మిరియాల పొడి 3. పంచదార 4. పుల్లదానిమ్మపండు 5. పాలు.

**సేకరణ: ఆకుండి నారాయణమూర్తి**